వాహనాల ఫిట్‌నెస్‌పై నజర్

- ఇసుక, మట్టి తరలింపుపై దృష్టి
- మైనర్..ర్యాష్ డ్రైవింగ్‌కు చెక్
- వాహనపత్రాలు లేకుంటే జరిమానా
- ప్రమాదాల నివారణకు చర్యలు


ఇసుక ట్రాక్టర్లను తనిఖీ చేస్తున్న ఎస్సై రాజకుమార్

బోయినపల్లి: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పెరగడంతో ఇసుక, మట్టి వినియోగం ఎక్కువగా ఉంది. ఈ క్రమంలో ఇళ్ల నిర్మాణానికి కావాల్సిన ఇసుక, మట్టి వినియోగం భారీగా పెరగడం, వాహనాల రాకపోకలు భారీగా పెరిగాయి. ప్రధానంగా ఇసుక, మట్టి రవాణా పెరగడంతో కొందరు ట్రాక్టర్ యజమానులు ఇదే అదనుగా భావించి సరైన వాహనపత్రాలు లేకున్నా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను ఇష్టారీతిన నడపుతూ సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. వీటిపై చర్యలు తీసుకునేందుకు పోలీసులు ఇసుక, మట్టి తరలించే వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు.

వాహనపత్రాలు లేకుంటే జరిమానా

ఇసుక, మట్టి తదితర సామగ్రి తరలించే వాహనాలకు వాహనం వెంట వాహన ధ్రువపత్రాలు తప్పనిసరిగా ఉండాలని అధికారులు పేర్కొంటున్నారు. వాహనదారులు ఆర్‌సీ బుక్, వాహనం ఫిట్‌నెస్, రిజిస్ట్రేషన్ వ్యాలిడిటీ, డ్రైవింగ్ లైసెన్స్, పొల్యూషన్, రెవెన్యూ నుంచి ఇసుక రవాణా అనుమతి పత్రం, తదితర ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలి. అయితే పలువురు వాహనదారులు వాహనానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, ఫిట్‌నెస్ లేకుండానే ఇసుక, మట్టి, కంకర తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో మండలంలో ఎస్సై రాజకుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు.

తనిఖీలు ముమ్మరం

ప్రభుత్వ అనుమతులతో ఇసుక, మట్టి రవాణా చేసేవారు ఎక్కువ ట్రిప్పులు ఇసుక తరలించాలనే ఉద్దేశంతో అతివేగంతో వాహనాలు నడుపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల స్థానిక పెట్రోల్ బంక్ వద్ద అతివేగంతో వెళ్తున్న ఓ ట్రాక్టర్ బోల్తాపడింది. వెంటనే సంబంధికులు వాహనాన్ని అక్కడి నుంచి తరలించారు. ప్రమాదకరమైన సంఘటనలు జరగకుండా ఉండేందుకు వాహనాల వేగ నియంత్రణ క్రమబద్ధీకరణకు పోలీసులు వాహనాల తనిఖీ ముమ్మరం చేశారు.

వాహనపత్రాలు ఉంచుకోవాలి



వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి. ఇసుక, మట్టి, కంకర తదితర ముడి సరుకులు తరలించే వాహనదారులు వాహనానికి సంబంధించిన ఆర్‌సీ, వాహన రిజిస్ట్రేషన్ వ్యాలిడిటీ, ఫిట్‌నెస్, డ్రైవింగ్ లైసెన్స్, పొల్యూషన్, ఇసుక అనుమతి పత్రాలు వెంట ఉంచుకోవాలి. లేదంటే జరిమానాలు తప్పవు. మైనర్లు డ్రైవింగ్ చేస్తే చర్యలు తప్పవు.

– రాజకుమార్, ఎస్సై, బోయినపల్లి

క్లుప్తంగా

జాతీయస్థాయి లేఖా రచన పోటీలు

సిరిసిల్లకల్చరల్: తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా జాతీయస్థాయి లేఖా రచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తాడేపల్లి గూడెంలోని ద్వారకాదాస్ రామేశ్వర గోయెంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ప్రకటించింది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని ఏ ప్రాంత విద్యార్థులైనా పోటీల్లో పాల్గొనవచ్చని ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. యువతపై సామాజిక మాధ్యమాల ప్రభావం, తెలుగు భాష విశిష్టత, ఏదైన కథానిక విశ్లేషణ, ఏవేని రెండు వచన కవితల విశ్లేషణ అంశాలపై ఒకదాన్ని ఎంచుకుని తమ రచనలు పంపించాలని కోరారు. ఉత్తమంగా ఎంపికైన 10 లేఖలకు నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేస్తామని తెలిపారు. లేఖలను డాక్టర్ సుంకర గోపాల్ డీఆర్‌జీ ప్రభుత్వ కళాశాల, పెంటపాడు, తాడేపల్లి గూడెం, పశ్చిమ గోదావరి జిల్లా 534 166 చిరునామాకు ఈనెల 25లోపు పంపించాలన్నారు. వివరాలకు 760 10 56172లో సంప్రదించాలని సూచించారు.

మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న చైర్మన్ ఎల్లయ్య

కోనరావుపేట: వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య అన్నారు. సోమవారం నిజామాబాద్ మార్కెట్ కమిటీ సాధారణ సమావేశం జరిగింది. మార్కెట్ కమిటీ వద్ద ప్రహరీ, రెండు గేట్లు ఆర్చి ఏర్పాటు చేయాలని తీర్మానించారు. వీటితో పాటు నిజామాబాద్, కోనరావుపేటలో రెండు హైమాస్ట్ లైట్లు, నాగారం, మామిడిపల్లి, వట్టిమల్ల, వెంకట్రావుపేట గ్రామాల్లో ఒకటి చొప్పున లైట్లు ఏర్పాటు చేయాలని, వీటన్నింటికి అవసరమైన రూ. 52 లక్షలకు తీర్మానం చేశారు. విప్ ఆది శ్రీనివాస్‌తో మాట్లాడగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. వైస్ చైర్మన్ తాళ్లపెల్లి ప్రభాకర్, డైరెక్టర్లు ఉప్పుల రాజు, బాశెట్టి నాగరాజు, సాసాల మల్లారెడ్డి, నాయిని ప్రభాకర్‌రెడ్డి, అజీమ్, వెంకన్న, వాల్యానాయక్, శ్రీనివాస్‌రెడ్డి, మాందాల లింబయ్య, కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

‘గన్నీ సంచుల పేరిట అక్రమాలు’

ఇల్లంతకుంట: మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో గన్నీ సంచుల పేరిట అక్రమాలు జరుగుతున్నాయని జిల్లా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గన్నారం నర్సయ్య ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొన్నేళ్లుగా సంఘంలో అక్రమాలు జరుగుతున్నాయని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. మూడేళ్లుగా రూ. 80 లక్షల వరకు అక్రమాలు జరిగాయన్నారు. ఇప్పటికైనా సహకార సంఘంలో జరుగుతున్న అక్రమాలపై కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా విచారణ చేపట్టాలని, లేకపోతే సహకార సంఘం ముందు ధర్నా నిర్వహిస్తామన్నారు.

సభను విజయవంతం చేయాలి



వీర్నపల్లి: మండల కేంద్రంతోపాటు గర్జనపల్లిలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గద్దరాశి భగవంతం ఆధ్వర్యంలో సోమవారం పెన్షన్‌దారులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి పుట్ట రవి మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్ మాదిగ హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో పెన్షన్‌దారులకు ఇచ్చిన హామీనీ మరిచిందన్నారు. వచ్చేనెల 3న హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించే సభకు పెన్షన్‌దారులు, వికలాంగులు, వితంతువులు, మండలం నుంచి పెద్దఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలన్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గద్దరాశి భగవంతం, బద్రి, హన్మయ్య, రాములు, వెంకటి, లింబయ్య, రాజయ్య, రాజం, తదితరులు పాల్గొన్నారు.

ఓటీపీ లేకుండా యూరియా అందించాలి


రైతుల వివరాలు నమోదు చేస్తున్న వ్యవసాయ అధికారులు

వేములవాడరూరల్: ప్రభుత్వం రైతులకు అందిస్తున్న యూరియాను ఎలాంటి ఓటీపీ లేకుండా అందజేయాలని రైతులు డిమాండ్ చేశారు. వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లిలోని గోదాం నుంచి రైతులకు సోమవారం యూరియా అందజేశారు. రైతులు ఉదయం నుంచి గోదాం వద్ద ఉండగా యూరియా రావడంతో ఒకేసారి రైతులు క్యూలైన్లలో నిలబడ్డారు. రైతులకు పాస్‌బుక్ ప్రకారం ఉన్న భూమిని బట్టి వ్యవసాయ అధికారి వినీత అందజేశారు.

చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలి


గంభీరావుపేట: విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఆర్‌బీఎస్‌కే అధికారులు


కోనరావుపేటలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న సిబ్బంది


ఇల్లంతకుంట : పెద్ద లింగాపూర్ ప్రాథమిక పాఠశాలలో


ముస్తాబాద్ : కస్తూర్బా పాఠశాలలో ..

కోనరావుపేట: 19 ఏళ్లలోపు వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని మండల వైద్యాధికారి వేణుమాధవ్ అన్నారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో 19 ఏళ్లలోపు చిన్నారులకు నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రలు వేసినట్లు తెలిపారు. నులి పురుగుల కారణంగా విద్యార్థుల్లో రక్తహీనత, మానసిక ఎదుగుదల లోపిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యసిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేములవాడరూరల్: జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా భవిత కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల విద్యాధికారి సదానందం పాల్గొని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. కార్యక్రమంలో భవిత సెంటర్ నిర్వాహకురాలు కత్తి జయలక్ష్మి, దివ్యాంగ విద్యార్థులు, తల్లిదండ్రులు, కోఆర్డినేటర్ మంగ, సీసీవో రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండలంలోని నర్మాల సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సృజన, వైస్ ప్రిన్సిపాల్ రాధిక, వైద్యాధికారి అరుణ, అఖిల్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. గంభీరావుపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందులు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకర్, ప్రభుత్వాసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థులకు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది నులి పురుగుల నివారణ మాత్రలు వేశారు. వైద్యురాలు జీవన జ్యోతి, వైద్యసిబ్బంది హెచ్ఈఓ వెంకటరమణ, తారాబాయి, ఏఎన్ఎంలు, ఆశాలు ,పాల్గొన్నారు

వేములవాడ: పట్టణంలోని కృష్ణవేణి స్కూల్‌లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. డైరెక్టర్ సన్నిధి వెంకటకృష్ణ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలంలోని పాఠశాలల్లో విద్యార్థులకు నులిపురుగు మాత్రలు వేశారు. మండల వైద్యాధికారిణి సారియా అంజుమ్ మాట్లాడుతూ..నులిపురుగు మాత్రలతో చిన్నారులు ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ముస్తాబాద్: పోతుగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేశారు. వైద్యాధికారి గీతాంజలి, సూపర్‌వైజర్లు, ఆశ కార్యకర్తలు విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు.

చందుర్తి : సనుగుల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులను నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. పల్లె దవాఖానా వైద్యాధికారి (ఎంఎల్‌హెచ్‌పీ) నవీన్, ప్రధానోపాధ్యాయుడు కట్కూరి ముఖేష్, ఆశ వర్కర్ రాజవ్వ తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: వీర్నపల్లి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మండల విద్యాధికారి తుమ్మ శ్రీనివాస్‌తో కలిసి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు సుజాత, కీర్తి, మంజుల, ఇందిరా ఆశవర్కర్లు పాల్గొన్నారు.

రుద్రంగి: మండలకేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. వైద్యసిబ్బంది, పాఠశాల అధ్యాపకబృందం, విద్యార్థులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆశవర్కర్లు

వేములవాడఅర్బన్: పట్టణంలోని న్యూ అర్బన్ కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై ఆశవర్కర్లు సోమవారం అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చిరుజల్లులు

సిరిసిల్ల: జిల్లా వ్యాప్తంగా ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు జిల్లాలో చిరుజల్లులు కురిశాయి. అత్యధికంగా ఎల్లారెడ్డిపేటలో 10.9 మిల్లీ మీటర్ల వర్షం పడగా.. రుద్రంగిలో 0.6, చందుర్తిలో 2.8, వేములవాడ రూరల్‌లో 0.3, వేములవాడలో 1.0, సిరిసిల్లలో 4.9, కోనరావుపేటలో 1.9, వీర్నపల్లిలో 0.8, గంభీరావుపేటలో 1.3, ముస్తాబాద్‌లో 0.7, తంగళ్లపల్లిలో 7.1, ఇల్లంతకుంటలో 7.9 మిల్లీ మీటర్ల వర్షం పడింది. బోయినపల్లిలో పెద్దగా వర్షం పడలేదు.

బార్ అసోసియేషన్‌లో రాఖీ వేడుకలు

వేములవాడ: వేములవాడ బార్ అసోసియేషన్‌లో సోమవారం రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. మహిళా న్యాయవాదులు పద్మ, మమత, అన్నపూర్ణ, సుజాత, సరితలు బార్ రూమ్‌లో అడ్వకేట్లకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు గుండ రవి, ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యనారాయణరెడ్డి,ఉపాధ్యక్షుడు కట్కం జనార్దన్, ఏజీపీ బొడ్డు ప్రశాంత్, అడ్వకేట్లు పాల్గొన్నారు.

రైతులకు సరిపడా యూరియా అందించాలి

వేములవాడ: రైతులకు కనీసం పంటలకు నీరు అందించకపోగా యూరియా కూడా అందించలేని దౌర్భాగ్య స్థితిలో ప్రభుత్వం ఉందని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో నెలకొన్న యూరియా సమస్యను పరిష్కరించడంతోపాటుగా రైతుల అవసరాలకు సరిపడేలా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ముందస్తు ప్రణాళిక లేకపోవడం వల్లే బస్తా యూరియా కోసం అర్ధరాత్రి వరకు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. రైతులు యూరియా కోసం అవస్థలు పడుతుంటే, విప్ ఆది శ్రీనివాస్ కనీసం పట్టించుకోవడం లేదన్నారు. ఇటీవల సొంత గ్రామమైన రుద్రంగిలో యూరియా కోసం రైతులు గంటల తరబడి నిరీక్షిస్తే ఆయన స్పందించకపోవడం సరికాదన్నారు.

ఆర్థికసాయం అందజేత



ముస్తాబాద్: మండలంలోని తెర్లుమద్దికి చెందిన అశోక్ ఇటీవల మృతిచెందగా, బాధిత కుటుంబానికి స్నేహితులు రూ.31వేల ఆర్థికసాయం, నిత్యవసర సరుకులు సోమవారం అందజేశారు. మృతుడి పిల్లల చదువులకు ప్రభుత్వం సాయం అందించాలని కోరారు. ఇక్కడ యెల్ల రాంరెడ్డి, కూర సంతోష్, రాజయ్య, రాజాగౌడ్, దేవయ్య, యాది మల్లేశ్ తదితరులున్నారు.

గుడుంబా తరలిస్తున్న మహిళపై కేసు

వీర్నపల్లి: బస్సులో గుడుంబా తరలిస్తున్న మహిళపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని గర్జనపల్లి నుంచి ఎల్లారెడ్డిపేటకు వెళ్తున్న బస్సులో అల్మాస్‌పూర్‌కు చెందిన ధరావత్ సంగీత సోమవారం గుడుంబా తరలిస్తుందన్న సమాచారంతో ఎస్సై వేముల లక్ష్మణ్, పోలీస్ సిబ్బంది వీర్నపల్లి బస్టాండ్ వద్ద బస్సును ఆపారు. 10లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని ఆమెపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా భూపేశ్



బోయినపల్లి: బోయినపల్లి మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా డిప్యూటీ తహసీల్దార్ భూపేశ్‌ను నియమిస్తూ కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. తహసీల్దార్ కే.నారాయణరెడ్డి సెలవులో ఉండగా డీటీ భూపేశ్‌ను ఫుల్ అడిషనల్ చార్జి తహసీల్దార్‌గా నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. తదుపరి ఉత్తర్వులు వెలువడేవరకు భూపేశ్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఉంటారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పార్వతీపురంలో పాము హల్‌చల్



వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయ వసతి గదులైన పార్వతీపురం వద్ద ఓ పాము సోమవారం హల్‌చల్ చేసింది. పామును చూసిన భక్తులు కేకలు వేయడంతో ఆలయ సిబ్బంది పాములు పట్టే యువకుడికి సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న యువకుడు చాకచక్యంగా పట్టుకుని పట్టణ శివారులో వదిలిపెట్టారు.

బోరు మోటార్లు ప్రారంభం

తంగళ్లపల్లి: మండలంలోని ఇందిరమ్మ కాలనీ గ్రామ పంచాయతీ పరిధిలో పలు వార్డుల్లో ఐదు బోరు మోటార్లను ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి గుండ్లపల్లి అనూష, గ్రామస్తులు బిట్ల బాలలక్ష్మి, రాయిని రేణుక, రుక్కుంబాయి, కవిత, నర్సవ్వ, శ్రీరామ్ మౌనిక, శ్రీపతి రుక్మిణి, గాజుల లత, మద్దికుంట లక్ష్మీ, అక్కల ఉమ, ఎర్ల సంధ్య, గాలి పుష్పలత, రాచమల్లు సుదర్శన్, మామిడాల రమేశ్, నరేశ్, బండి రవి, తదితరులు పాల్గొన్నారు.

బోరు రిపేర్ చేసొచ్చే సరికి బైక్ మాయం

ఎల్లారెడ్డిపేట: రాజన్నపేట శివారులోని పొలం వద్ద వ్యవసాయ బోరు రిపేర్ చేసి వచ్చేసరికి రోడ్డుపై నిలిపిన బైక్ చోరీకి గురైంది. బాధితుడి ఫిర్యాదుతో విచారణ చేపట్టిన పోలీసులు దొంగను పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. ఎస్సై రాహుల్‌రెడ్డి తెలిపిన వివరాలు. మండలంలోని గొల్లపల్లికి చెందిన ముత్యాల సాయికిరణ్‌కు రాజన్నపేట శివారులో వ్యవసాయ భూమి ఉంది. అందులో ఉన్న బోర్ రిపేర్ కావడంతో ఈనెల 8న తంగళ్లపల్లి మండలం గండిలచ్చపేటకు చెందిన నీరటి శ్రీనివాస్‌కు ఫోన్ చేసి పిలిపించుకున్నాడు. శ్రీనివాస్ బైక్‌పై వెళ్లి పొలం వద్ద రోడ్డు పక్కన నిలిపి బోర్ మరమ్మతు చేసి వచ్చే సరికి మాయమైంది. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిరిసిల్ల మండలం చిన్న బోనాలకు చెందిన బానోతు తిరుపతి బైక్ చోరీ చేసినట్లు గుర్తించి, అరెస్ట్ చేశారు. కోర్టులో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.



ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్‌కు వెళ్లే రహదారి ప్రమాదకరంగా మారింది. రోడ్డు కిరువైపులా వర్షపు నీరు, మరో వైపు నడిరోడ్డుపై ప్రమాదానికి గురైన కారు ఉండదంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. టర్నింగ్ వద్దనే కారు ఉండడం, ఎదురుగా మరోవైపు రోడ్డుపై నీరు నిలవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. నడిరోడ్డుపై ఉన్న కారును తొలగించి, నీటిని రోడ్డుపై నుంచి బయటకు తొలగించాలని వారు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : జాఫర్, కార్యదర్శి
నారాయణపూర్: సెల్ నంబర్: 8328049205

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

విద్యార్థులు ఉన్నతస్థానాలకు చేరుకోవాలి


విద్యార్థికి బహుమతి ప్రదానం చేస్తున్న ప్రిన్సిపాల్ విజయలక్ష్మి

చందుర్తి: విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నతస్థానాలకు చేరుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పర్యావరణ పరిక్షణపై నెహ్రూ యువకేంద్రం, మై భారత్ ఆధ్వర్యంలో సోమవారం వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. నెహ్రూ యువకేంద్రం ప్రతినిధి గంగిపల్లి స్వామి, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణాకర్, పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షుడు నంద్యాడపు వెంకటేశ్, గుగ్గిళ్ల సాగర్, మేడిశెట్టి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

హర్‌ఘర్ తిరంగా ర్యాలీ


కోనరావుపేటలో ర్యాలీ తీస్తున్న నాయకులు

కోనరావుపేట: మండలకేంద్రంలో బీజేపీ అధ్యక్షుడు మిర్యాల్‌కార్ బాలాజీ ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. గాంధీ విగ్రహం నుంచి బస్టాండ్ వరకు సాగిన ఈ యాత్రలో మాట్లాడుతూ ప్రజల్లో దేశభక్తి, చైతన్యభావాన్ని పెంపొందించేందుకే ఈ యాత్ర చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ మార్త సత్తయ్య, గొట్టె రామచంద్రం, పల్లం అన్నపూర్ణ, సురేశ్‌గౌడ్, చీకటి మధు, జలెందర్, జవ్వాజి తిరుపతి. గుండ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రుణ వివరాలు ముద్రించాలి

- అర్బన్ బ్యాంక్ ఎదుట సభ్యుల నిరసన


బ్యాంకు ముందు ప్రాథమిక సభ్యుల నిరసన


సిరిసిల్లటౌన్: అర్బన్ బ్యాంక్‌లోని రుణ వివరాలు, లాభనష్టాల గురించి మహాసభ నివేదికలో ముద్రించాలని కోరుతూ పలువురు సభ్యులు సోమవారం స్థానిక బ్యాంక్ ఎదుట నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ సెప్టెంబర్‌లో నిర్వహించే 39వ వార్షిక మహాసభలో నివేదిక బుక్కులో బ్యాంక్ అన్ని లోన్ల డ్యూ లిస్ట్ ముద్రించాలని కోరారు. ఎల్లారెడ్డిపేట బ్రాంచ్ జమ, ఖర్చులు లాభనష్టాల వివరాలు విడిగా ముద్రించాలన్నారు. ఐదేళ్లుగా రెగ్యులర్ సీఈవో లేరని, వెంటనే కొత్త సీఈవోను నియమించాలని కోరారు. అర్బన్ బ్యాంక్ ప్రాథమిక సభ్యులు, పౌర సంక్షేమ సమితి అధ్యక్షులు బియ్యం కార్ శ్రీనివాస్, సహాయ కార్యదర్శి కుసుమ గణేష్, కోశాధికారి చిప్ప దేవదాస్, సభ్యులు వెంట ప్రకాష్, బోడ శ్రీనివాస్, మడికొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ


సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న రవికుమార్

సిరిసిల్లటౌన్: పట్టణంలోని పద్మనగర్‌లో మాజీ కౌన్సిలర్ కుడికల రవికుమార్ పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కాముని దత్తు తండ్రి శంకరయ్యకు రూ.60,వేలు, రాపెల్లి అర్చన రూ. 29 వేలు, గాజుల ఓంకార్‌కు రూ.10500, పొన్న రమ్యకు రూ.21,500, లింగంపెల్లి మమతకు రూ. 14 వేలు, గాజుల వరలక్ష్మికి రూ.5వేలు, దుస కమలకు రూ. 25వేలు మంజూరుకాగా సోమవారం పంపిణీ చేశారు. 25వ వార్డు మాజీ కౌన్సిలర్ కుడికాల రవికుమార్, వార్డుకమిటీ సభ్యులు తదితరులున్నారు.

అల్మాస్‌పూర్‌లో..



ఎల్లారెడ్డిపేట: మండలంలోని అల్మాస్‌పూర్ గ్రామంలో సీఎం సహాయనిధి చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి పలువురికి పంపిణీ చేశారు. ఇక్కడ కాంగ్రెస్ నాయకులు చెట్టిపల్లి బాలయ్య, సానవేని రాజయ్య, సురేశ్, పెద్దూరి పర్శరాములు, లబ్ధిదారులు తదితరులున్నారు.

కేటీఆర్‌పై బీజేపీ వ్యాఖ్యలు అర్థరహితం

సిరిసిల్లటౌన్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావుపై బీజేపీ నాయకుల వ్యాఖ్యలు అర్థ రహితమని బీఆర్‌ఎస్‌వై వింగ్ జిల్లా అధ్యక్షుడు సుంకపాక మనోజ్ పేర్కొన్నారు. తెలంగాణ భవన్లో సోమవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్ రెండు కలిసి కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. నియోజకవర్గంలో కేటీఆర్ చేసిన అభివృద్ధి ఏమిటో ప్రతీ గ్రామంలో చూపిస్తామని, కేంద్ర మంత్రిగా బండి సంజయ్ చేసిన ఏం చేశారో.. చూపెట్టే దమ్ము మీకు ఉందా అని బీజేపీ నాయకులకు సవాల్ విసిరారు. మెట్ట రాజు, కత్తెర వరుణ్‌కుమార్, షేక్ సికిందర్ , వేణు, ఆరుట్ల శరన్ పాల్గొన్నారు.

దరఖాస్తులకు రేపు చివరి తేదీ

ఇల్లంతకుంట: జూన్ 5లోపు కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు రైతుబీమా కోసం ఆయా గ్రామ వ్యవసాయ క్లస్టర్ రైతు వేదికల్లో దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎం సురేశ్ రెడ్డి తెలిపారు. సోమవారం ఇల్లంతకుంట వ్యవసాయ కార్యాలయంలో మాట్లాడారు. 18 ఏళ్లనుంచి 59 ఏళ్లమధ్య ఉన్నవారు అర్హులన్నారు. ఈనెల 13 చివరి తేదీ అని పేర్కొన్నారు.